ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు

5

సోమవారం 7 జూలై 2025



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె - 9985411377

ఉద్యాన పంటలు భేష్

ఇది ఉద్యాన పంటల కాలం. తక్కువ శ్రమతో అధిక లాభాలు గడించొచ్చు. వ్యవసాయంలో ఉద్యాన పంటలకు ప్రభుత్వ సాయం మెండు. అనేక కారణాల వల్ల పత్తి, మిర్చి, పొగాకు తదితర వాణిజ్య పంటల సాగుతో రైతులు తరచూ నష్టపోతున్నారు. అప్పులపాలై కుటుంబాలు కుంగిపోతున్నాయి. ఈ తరుణంలో ఉద్యాన పంటలు రైతులను ఆదుకుంటున్నాయి. జిల్లాలో అరటి, బొప్పాయి, మామిడి, చీనిత నిమ్మ తోటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. పూల మొక్కలు, హైబ్రిడ్ కూరగాయల సాగు పెరుగుతోంది.



ఎం.తండాలో సాగులో ఉన్న మామిడితోట

- వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయంగా పండ్ల తోటలు
- తక్కువ పెట్టుబడులు.. అధిక ప్రభుత్వ రాయితీలు
- మొగ్గు చూపుతున్న రైతులు

చాగలమర్రి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయంలో మార్పులు వస్తున్నాయి. భారీ పెట్టుబడళ్లతో, మార్కెట్ మాయాజాలంతో దగాపడుతున్న రైతులు ఇటీవల ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలతో ఈ పంటలు సాగు చేసుకొని లాభాలు గడించమని అధికారులు సూచిస్తు న్నారు. ఈ పంటల కోసం రైతులు మొదట భూసార, నీటి పరీక్ష కూడా చేయించుకోవాలి. తమ ప్రాంతాలకు అనువైన పండ్ల మొక్కలను, పూల మొక్కలను ఎంపిక చేసుకోవాలి.

ప్రభుత్వ రాయితీలు ఇలా..

జిల్లా పరిధిలో 48 వేల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే రాయితీల నిబంధనలు ఇలా ఉన్నాయి. ఒక రైతుకు 5 ఎకరాలకు మాత్రమే రాయితీ ఇస్తారు. 5 ఎకరాలకు మించి భూమి ఉన్న పెద్ద రైతుకు కూడా పథకానికి అర్హులే అయినప్పటికీ 5 ఎకరాలకు మాత్రమే రాయితీ వర్తిస్తుంది. నీటి వసతి ఉండి బిందుసేద్యం ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు. రైతుకు అయ్యే ఖర్చులో 40 శాతం సబ్సిడీగా ఇస్తారు. అందులో 60 శాతం మొదటి ఏడాది, మిగిలిన 40 శాతం రెండో ఏడాది నేరుగా రైతుల ఖాతాకు జమ చేస్తారు. రెండో ఏడాది రాయితీ రావడానికి రైతులు నాటుకున్న మొక్కల్లో 80 శాతం బతికి ఉండాలి. ఇది కాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా 100 శాతం రాయితీతో 16 రకాల పండ్ల తోటల మొక్కలు సాగు చేసుకునేందుకు మూడేళ్ల పాటు ప్రభుత్వం నిధులను ఖర్చు చేస్తుంది. ఈ ఏడాది 4,600 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉంది. 29 మండలాల్లో పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటి వరకు 50 శాతం మంది రైతులు పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకున్నారు.

పూల తోటలకు..

హైబ్రిడ్ కూరగాయలకు ఎకరాకు రూ.9,600, పూల తోటలైన బంతి, చామంతి, మల్లె మొక్కలకు ఎకరాకు రూ.8 వేలు చొప్పున రాయితీ అందించనున్నారు.

సబ్సిడీ కోసం రైతులు అధికారులకు ఇవ్వాల్సిన ధ్రువపత్రాలు

దరఖాస్తుతో పాటు రైతు ఉద్యానశాఖ అధికారులకు వీటిని సమర్పించాల్సి ఉంటుంది.

రైతు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీ 1-బి నకళ్లు లేటేస్టు కాపీ

ఆధార్‌కార్డు జిరాక్స్ బ్యాంకు ఖాతా పాసుబుక్కు కాపీలు, రైతు పాసుపోర్టు ఫొటోలు మొక్కలు కొనుగోలు చేసిన బిల్లు ఇవ్వాలి.



కొలుములపేటలో సాగులో ఉన్న చీని తోట

మూడెకరాల్లో అరటి సాగు చేశా



మూడెకరాల్లో అరటి పంట సాగు చేశా. వాణిజ్య పంటలకు పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో పండ్ల తోటల సాగుపై దృష్టి మళ్లించా. అరటి సాగులో ఎకరాకు రూ.3 లక్షలు దాక ఆదాయం వస్తోంది. గత ప్రభుత్వంలో రాయితీలు, డ్రిప్ సౌకర్యం కల్పించలేదు. కూటమి ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుండటంతో ఆనందంగా ఉంది.

-అనిల్‌కుమార్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి

ప్రభుత్వం అందించే రాయితీ వివరాలు

పంట	ఎకరాకు మొక్కలు	మొదటి ఏడాది	రెండో ఏడాది	మొత్తం
మామిడి	72	12,000	8,000	20,000
మామిడి	160	19,200	12,800	32,000
మామిడి	670	28,800	19,200	48,000
జామ	44	19,200	12,800	32,000
బత్తాయి	111	12,000	8,000	20,000
సపోటా	160	14,400	9,600	24,000
అరటి	123	16,800	11,200	25,000
బొప్పాయి	1,235	7,200	4,800	12,000
సీతాఫలం	250	7,200	4,800	12,000
ఉసిరి	111	7,200	4,800	12,000



చిన్నవంగలిలో నాటిన అరటి మొక్కలు

ప్రభుత్వ రాయితీలతో రైతులకు మేలు



ఉద్యాన పంటలు సాగు చేయాలనుకునే రైతులకు ప్రభుత్వ రెండేళ్ల పాటు రాయితీ అందజేస్తుంది. రైతులు నాణ్యమైన, మంచి గుర్తింపు ఉన్న నర్సరీల్లో మొక్కలు తెచ్చుకోవాలి. భూసార పరీక్షతో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు. రైతులు ఉద్యానశాఖ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలి.

-శ్రీధర్, ఉద్యానశాఖ అధికారి, ఆళ్లగడ్డ

నేటి నుంచి పీజీ, బీటెక్ పరీక్షలు

కర్నూలు అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో పీజీ 4వ సెమిస్టర్, బీటెక్ 3, 4, 5, 6, 7 సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్నారు. పరీక్షల ఏర్పాట్లు పూర్తయ్యాయని ఉపకులపతి వి. వెంకటబసవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ పరీక్షలు ఈనెల 7 నుంచి 28 వరకు జరగనున్నాయని, 452 మంది రెగ్యులర్, 44 మంది సప్లిమెంటరీకి దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. బీటెక్ పరీక్షలు ఈనెల 7 నుంచి 31 వరకు జరగనున్నాయని, 360 మంది రెగ్యులర్, 325 మంది సప్లిమెంటరీ రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఉదయం 9.30 గంటలకు ఇక్కడకు వచ్చే విధంగా ఉండాలని పేర్కొన్నారు. మండల, డివిజన్ స్థాయిలో కూడా అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. అక్కడ పరిష్కారం కానీ వారు మాత్రమే జిల్లా కేంద్రంకు రావాలని సూచించారు. అర్జీ ఏదశలో ఉందని, పరిష్కార విషయం 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని వివరించారు. అధికారులు 9.30 గంటల కల్లా హాజరు కావాలని ఆదేశించారు.

రేపు టీడీపీ సమావేశం

- హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

నంద్యాల, జూలై6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10గంటలకు టీ డీపీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లా డారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగే మధ్యాహ్నం 2గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి మండలి సమావేశం (డీడీఆర్‌సీ) నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఖాదీనం

- ఖాదీ పరిశ్రమల బోర్డుకు కార్యాలయం కరువు
- కనుమరుగవుతున్న కొలువులు
- అరకొర జీతాలతో సిబ్బంది అవస్థలు
- అటకెక్కిన పీఎంఈజీపీ పథకం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి గుండెకాయ లాంటి ఖాదీ బోర్డు దీనావస్థకు చేరుకుంది. నాడు ఓ వెలుగు వెలిగిన జిల్లా ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు ప్రస్తుతం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సిబ్బంది కొరత, అరకొర జీతాలు, అర్ధాంతరంగా ఆగిన పథకాలతో ఖాదీ బోర్డు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అక్కడి ఉత్పత్తు లకు ఆదరణ కల్పించటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించాలి. ఇదే సత్సంకల్పంతో అర్ధ శతాబ్దం క్రితం ఖాదీ బోర్డు పురుడు పోసుకుంది. తొలి నాళ్లలో ప్రభుత్వాలు, ఈ శాఖకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చి, గ్రామాల్లోని కుల వృత్తులు, హస్తకళలను ప్రోత్సాహించి, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో సహకారం అందించారు.

పాలకుల నిర్లక్ష్యం..

కాలక్రమంలో పాలకుల నిర్లక్ష్యం, నిరాదరణ వల్ల పథకాలతో పాటు ఈ శాఖ సైతం నిర్వీర్యం అవుతూ వస్తోంది. ఫలితంగా దీనిని నమ్ముకున్న వందల సంఖ్యలో ఉద్యోగు లతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలలు కనే ఆశావహులు తీవ్ర నిరుత్సాహానికి గురి అవుతున్నారు.

నాడు ఉద్యోగులతో కళకళ...

గతంలో ఈ శాఖ కార్యాలయం పదుల సంఖ్యలో ఉద్యోగులతో కళకళలాడేది. సహాయ సంచాలకులు, పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు, దిగువ శ్రేణి సహాయకులు, ఎగువశ్రేణి సహాయకులు, అటెండర్లు ఇలా పలు రకాల స్థానాలతో కార్యాలయం నిండుగా ఉండేది. కొన్నేళ్ల నుంచి కొత్త నియమాకాలు లేవు. ఎవరైన పదవీ విరమణ పొందినా, మరణించినా వాటి స్థానాలను అలాగే ముగించేస్తున్నారు.

మిగతా 7వ పేజీలో

శ్రీశైలం జలాశయానికి భారీ వరద

- ఇప్పటి నీటి లభ్యత 184.2774 టీఎంసీలు
- 879.30 అడుగులకు చేరిన నీటి మట్టం
- మంగళ, బుధవారాల్లో గేట్ల ఎత్తివేత?
- అనుమతి కోసం అధికారుల ఎదురుచూపులు



శ్రీశైలం జలాశయంలోకి చేరిన వరద జలాలు

నంద్యాల, జూలై6(ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద భారీగా వచ్చిచేరుతోంది. ఎగువ ఉన్న తుంగభద్ర, ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయిని, జూరాల జలాశయాల గేట్లు ఇప్పటికే ఎత్తారు. దీంతో దిగువన శ్రీశైలం జలాశయానికి పెద్దఎత్తున వరద కొనసాగుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 1,09,216 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 67,218 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రానికి జలాశయంలో నీటి లభ్యత 184.2774 టీఎంసీలు ఉండగా నీటి మట్టం 879.30 అడుగులకు చేరింది. వీటితో పాటు విద్యుత్ ఉత్పాదన కింద జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 67,019క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

తుంగభద్రలో 100 టీఎంసీలు..

ఆల్మట్టి, నారాయణపుర డ్యాంలకు వచ్చిన నీటిని వచ్చినట్లుగానే దిగువకు వదిలి పెడుతున్నారు. తుంగభద్రలో 100 టీఎంసీలు కెపాసిటీ ఉండగా.. సుమారు 80శాతం నిండింది. జలాశయం నుంచి 55 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు 80 వేల క్యూసెక్కుల మేర వరద శ్రీ శైలానికి వచ్చి చేరుతోంది. దీంతో కుడి, ఎడమ జల ఉత్పాదన కేంద్రాలను పూర్తిస్థాయిలో నడుపుతున్నారు. వీటి ద్వారా 67 వేలు క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు చేరుతోంది.

అధికారులు అందుబాటులో ఉండాలని..

శ్రీశైలం జలాశయం గేట్లను అతి త్వరలోనే ఎత్తి నీటిని విడుదల చేయాలని ఆ శాఖాధికారులు అంచనాకు వచ్చినట్లు సమాచారం. భారీగా వరద వచ్చి చేరడంతో.. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటోంది. ఏక్షణంలోనైనా జలాశయం గేట్లు తెరిచే అవకాశం ఉందని, జలాశయం అధికారులందరూ అందుబాటులోని ఉండాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఆశాఖ అధికారులు గేట్లు ఎత్తడానికి అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదించారు. ఈక్రమంలో అధికారులు కూడా అనుమతి కోసం ఎదురుచూస్తున్నారని సమాచారం. ఏది ఏమైనా మరో రెండు రోజుల్లో శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణమ్మ పరవళ్లు తొక్కనుంది.

ఉత్కంఠ...

215 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం ఉన్న శ్రీశైలం జలాశయంలో ఇప్పటికే సుమారు 185 టీఎంసీలు ఉండటంతో ఉత్కంఠ రేపుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే శ్రీశైలం జలాశయం ఫుల్ అన్నట్లైంది. ఈనేపథ్యంలో మంగళ, బుధవారాల్లో శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం ఉందని ఆశాఖవర్గాల నుంచి తెలిసింది. అధికారులు అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదించారని సమాచారం. ఏది ఏమైనా శ్రీశైలం జలాశయం నీరు ఎప్పుడు విడుదల చేస్తారో..? అని అందర్నిల్లో ఉత్కంఠ రేపుతోంది. ఇదే క్రమంలో రైతుల్లో ఆసక్తి నెలకుంది. ఇదిలా ఉండగా.. రేపు నంద్యాల కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సలహా మండలి (డీడీఆర్‌సీ) సమావేశం ఉంది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌తో మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ హజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అదే రోజు శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తే అవకాశం ఉందని తెలిసింది. ఈ క్రమంలో రిటైర్డు చీఫ్ ఇంజనీర్ కన్నయ్యనాయుడు కూడా జలాశయాన్ని పరిశీలనకు వచ్చారని సమాచారం.

బానకచర్ల ప్రాజెక్టు ఓ గేమ్ ఛేంజర్

- రాజకీయ ఉనికికోసమే తెలంగాణ పార్టీల తాపత్రయం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి
- పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల
- పాల్గొన్న ఎంపీ శబరి, ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, జూలై 6(ఆంధ్రజ్యోతి): బానకచర్ల ప్రాజెక్టు ఓ గేమ్ ఛేంజర్ అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రితో కలిసి నంద్యాల ఎంపీ శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యతో కలిసి పోతిరెడ్డిపాడు నుంచి దిగువకు ఎస్సార్బీసీ కాలువలోకి నీటిని విడుదల చేశారు.



పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎంపీ శబరి, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య

కృష్ణమ్మకు జలహారతి సమర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరదలు వచ్చిన సమయంలో సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని ఒడిసిపట్టి బానకచర్లకు మళ్లించి రాయలసీమకు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతుంటే దీన్ని తెలంగాణ పార్టీలు తమ ఉనికిని చాటుకునేందుకు తాపత్రయం పడుతున్నారన్నారు. మిడుతూరు మండలంలోని అలగనూరు రిజర్వాయర్ గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలతో ప్రాజెక్టు పూర్తికాలేదని, రూ.30కోట్లతో పూర్తయ్యే రిజర్వాయర్ ప్రస్తుతం రూ.100కోట్లకు పెరిగే పరిస్థితి నెలకొందన్నారు. త్వరలో అలగనూరు రిజర్వాయర్ మరమ్మతు పనులు చేపడుతామన్నారు. ఎన్నడూలేని విధంగా జూలై మొదటి వారంలోనే పోతిరెడ్డిపాడు నుంచి నీటిని అందిస్తున్నామని రైతులు వృథా చేయకుండా నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాగు, సాగునీటి అవసరాల నిమిత్తం 5వేల క్యూసెక్కులను దిగవకు వదులుతున్నామని అన్నారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, ఈఈ నాగేంద్ర కుమార్, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, మున్సిపల్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పోతులపాడు సర్పంచ్ నిర్మలమ్మ, టీడీపీ నాయకులు మాండ్రసురేంద్రనాథ రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, మోహ న్‌రెడ్డి, రవి కాంత్, శివానందరెడ్డి, నాగేశ్వరరావు, చిన్నవెంకటస్వామి, సైఫుద్దీన్, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

ప్రేమ జంట ఆత్మహత్య 7

శ్రీశైలం, మహానంది క్షేత్రాల్లో భక్తుల రద్దీ



శ్రీశైల క్షేత్రంలో కంపార్టుమెంట్‌లో ఉన్న భక్తులు

నంద్యాల, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో భక్తుల రద్దీ పెరిగింది. తొలి ఏకాదశితో ఆదివారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున స్వామి, అమ్మవార్ల దర్శనానికి తరలివచ్చారు. దీంతో శ్రీశైల మహాక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. వీఐపీ, బ్రేక్ టికెట్లకు చెందిన భక్తులను సైతం దర్శనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు మూడు విడతలుగా అనుమతి కల్పించారు.

మహానంది: మహానంది క్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ప్రధాన ఆలయాల్లోని మహానందీశ్వరుని, కామేశ్వరీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే నవనంది క్షేత్రాలైన వినాయకనంది, గరుడ నందీశ్వరుని ఆలయాలతో పాటు భారీ నంది విగ్రహానికి పూజలు చేసారు. భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు ఏఈవో మధు తెలిపారు.



మహానందిలో క్యూలో నిల్చున్న భక్తులు

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం,
శ్రీశైలం -518101, నంద్యాల జిల్లా.

SRISAILA

ఇ-ప్రొక్యూర్‌మెంట్-కం-బహిరంగవేలం ప్రకటన

ఆర్.సి.నెం. సి2/444/2023, తేదీ :01.07.2025

శ్రీశైల దేవస్థానం హక్కు భుక్తములలోని ఈ క్రింద తెలిపిన ఐటములకు లైసెన్స్ హక్కులు మంజూరు కొరకు తేదీ: 17.07.2025 న ఉదయం గం. 11-00 ల నుండి పరిపాలన భవనము నందు బహిరంగవేలం నిర్వహించబడును.

క్ర. సం	వివరములు	కొలతలు	లీజుకాలము	ధరావత్తు రూ.	Upset price Per Month
1.	సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయము పై భాగమున డార్మెటరీ & రెస్టారెంట్ నిర్వాహణ లైసెన్సు హక్కు	3491 Sft	స్వాధీనపరచిన తేదీ నాటి నుండి రెండు (2) సంవత్సరముల కాలపరిమితికి మాత్రమే	20,00,000/- D.D మూడు (3) పోస్ట్ డేటెడ్ చెక్కులు & ఏదైనా గుర్తింపు కార్డు	5,50,000/-

ఆసక్తి గల వారు శ్రీయుత కార్యనిర్వహణాధికారి, శ్రీశైల దేవస్థానం, శ్రీశైలం పేరున ధరావత్తుగా డి.డి., 3 పోస్టు డేటెడ్ చెక్కులు మరియు గుర్తింపు కార్డు సమర్పించి పాల్గొనవచ్చును. ఇ- ప్రొక్యూర్‌మెంట్ నందు పాల్గొనుటకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in ను సందర్శించి పాల్గొనవచ్చును.

ఇతర వివరముల కొరకు దేవస్థానం కార్యాలయ పనివేళలలో సెల్ 6300057600, 9441096182 & 8801192939ను సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- ఎం. శ్రీనివాసరావు,
స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి.

సంప్రదాయబద్ధంగా మొహర్రం

- మాతంతో బనగానపల్లె వీధులు రక్తసిక్తం
- నవాబు వంశీయుల ప్రత్యేక ప్రార్థనలు
- ఊరేగింపులో పాల్గొన్న షియా ముస్లింలు



బనగానపల్లెలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

బనగానపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అత్యంత సంప్రదాయబద్ధంగా జరిగే మొహర్రం బనగానపల్లెలో ఆదివారం ముగిసింది. వేలాది మంది షియా ముస్లింలు పాల్గొన్నారు. దొరకోటలోని పీర్ల వద్ద నవాబు వంశీయుల వారసులు మీర్ ఫజుల్ అలీఖాన్, వారి కుటుంబసభ్యులు, షియా ముస్లింలు శోకతప్త హృదయాలతో ప్రార్థనలు చేశారు. వారు ఫాతేహాలు నిర్వహించిన అనంతరం మొహర్రం ఊరేగింపు ప్రారంభమైంది. షియా మతస్తులు దొరకోట వద్ద తలపై కత్తితో కోసుకొని అమరులైన ఇమాంహుస్సేన్ వారి కుటుంబ సభ్యులను స్మరించుకుంటూ నల్లదుస్తులతో ఊరేగింపులో పాల్గొన్నారు. షియా ముస్లింలు బ్లేడులు, కత్తులతో ఎదలపై కొట్టుకుంటూ పీర్ల వెంట విషాద గీతాలు పాడుకుంటూ మాతంలో పాల్గొన్నారు. మాతం నిర్వహించడంతో పట్టణంలోని వీధులు రక్తసిక్తమయ్యాయి. పట్టణంలోని ప్రజలతో పాటు వివిధ గ్రామాలనుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఈ విషాద ఉత్సవాలను, మాతంను మిద్దెలు, మేడలపై ఎక్కి తిలకించారు. దొరకోట నుంచి ప్రారంభమైన ఈ మొహర్రం సందర్భంగా పీర్లు ఉత్సవం పట్టణంలోని పోస్టాఫీసు, ఆస్థానం రోడ్డు, సర్కిల్ పోలీస్‌స్టేషన్, పాతబస్టాండు, పొట్టిశ్రీరాములు కూడలి మీదుగా జుర్రేరువాగు వరకు సాగింది. పట్టణంలోని మొత్తం 40 పీర్ల చావిళ్ల నుంచి పీర్లు దొరకోట పీర్ల వెంట రాగా సాయంత్రం జుర్రేరు వాగుకు చేరుకున్నాయి. అక్కడ పీర్లను శుద్ధి చేసి తిరిగి పీర్ల చావిళ్లకు చేర్చారు. ప్రతి పీర్ల పెట్టెల వెంట శోకతప్త హృదయాలతో ప్రార్థనా గీతాలు ఆలపించారు. మొహర్రం సందర్భంగా వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డోన్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బనగానపల్లె సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథ రెడ్డి, ఎస్ఐలు దుగ్గిరెడ్డి పోలీసు సిబ్బంది, హోంగార్డులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పాల షర్బత్ పంపిణీ

పాతబస్టాండ్ సమీపంలోని గురెడ్డి కాలనీ వద్ద మంత్రి బీసీ బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో మాతంలో పాల్గొన్న ముస్లింలకు పాల షర్బత్ పంపిణీ చేశారు. బీసీ జనార్దన్‌రెడ్డికి చెందిన ట్యాంకర ద్వారా పట్టణంలో నీటిని చల్లారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది వీధులను శుభ్రం చేశారు. సాయంత్రం పీర్లు జుర్రేరు వాగులోకి వెళ్లి అక్కడ పీర్లను పరిశుభ్రం చేసి యథావిధిగా పీర్లచావిడి, లేదా వారి ఇళ్లలో పీర్లను యథాస్థానంలో చేర్చారు.



బనగానపల్లెలో ఎదలపై కత్తులు, బ్లేడ్లతో కొట్టుకుంటూ మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

- హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక తిరుపతికి చెందిన బాలిక ఆత్మహత్య
- కర్నూలు జిల్లా బనవాసి ఏపీఆర్‌జేసీలో విషాదం



ఆత్మహత్య చేసుకున్న రిషిత

ఎమ్మిగనూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి ఏపీఆర్‌జేసీలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతున్న రిషిత (17) ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కళాశాల అధికారులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామానికి చెందిన మస్తానయ్య, మంజుల కుమార్తె రిషితకు మూడో ఫేస్ కౌన్సెలింగ్‌లో ఎమ్మిగనూరు మండలం బనవాసి ఏపీఆర్‌జేసీ (ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ జూనియర్ కాలేజి)లో బైపీసీ గ్రూపులో సీటు వచ్చింది. దీంతో వారం రోజుల క్రితం రిషిత తల్లిదండ్రులు బనవాసి కళాశాలలో వదిలివెళ్లారు. అయితే ఇక్కడ ఉండలేనని రోజు తల్లిదండ్రులకు ఫోన్ చేస్తుండేది. అయితే వారు సర్దిచెబుతూ వచ్చారు. ఆదివారం రిషిత తల్లిదండ్రులు బనవాసిలోని ఏపీఆర్‌జేసీ కళాశాలకు వచ్చి కూతురుతో సాయంత్రం వరకు గడిపారు. మంచి కళాశాలలో సీటు వచ్చిందని, భవిష్యత్తు బాగుంటుందని ఇక్కడే ఉండి చదువుకోవాలని రిషితకు నచ్చజెప్పి 4.30 గంటలకు సొంతూరికి బయలుదేరారు. అయితే ఇక్కడ హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేని రిషిత తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది. రాత్రి 7 గంటల సమయంలో హాస్టల్‌లో ఉన్న బాత్‌రూంలోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకుంది. విద్యార్థిని కనిపించకపోవడంతో కొద్దిసేపు వెతికారు. చివరికి బాత్‌రూంల్లో చూడగా ఓ రూంకు గడి వేసి ఉండటంతో తెరిచేందుకు ప్రయత్నించారు. రాకపోవటంతో మరో బాత్‌రూం ద్వారా వెళ్లి చూడగా రిషిత ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్యలత రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కళాశాలకు చేరుకొని బాలికను వెంటనే ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చిన వెంటనే వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు ఆసుపత్రికి చేరుకొని బాలిక మృతదేహాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రిషిత ఆత్మహత్యకు పాల్పడం బాధాకరమని అన్నారు. హోం సిక్ వల్లే మానసిక ఆందోళనకు గురైందని తెలుస్తోందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సం బైపీసీలో చేరిన రిషిత వారం రోజుల్లో ఆత్మహత్యకు పాల్పడటం కళాశాలలో తీవ్ర విషాదం నెలకొంది.

ప్రేమ జంట ఆత్మహత్య

- ప్రకాశం జిల్లాలో చెట్టుకు ఉరివేసుకున్న ప్రేమికులు
- నంద్యాల జిల్లా మాధవరంలో విషాదం

ప్యాపిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ఓ ప్రేమ జంట చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాధ ఘటన ఆదివారం ప్రకాశం కొమరోలు మండలంలోని అక్కపల్లి గ్రామ శివారు ప్రాంతంలో జరిగింది. మాధవరం గ్రామానికి చెందిన కంబగిరి రాముడు(24), భారతి(22) ఇద్దరూ గ్రామంలో కూలీ పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా ప్రేమకు దారి తీసింది. ఏడాదిగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. అయితే భారతికి రెండేళ్ల క్రితం మండలంలోని అలేబాదు గ్రామానికి ఓ వ్యక్తితో వివాహమైంది. కుటుంబ కలహాలతో ఆ యువతి భర్తను వదిలేసి ఏడాదిగా పుట్టింటిలోనే ఉంటోంది. ఈ క్రమంలో భారతి, కంబగిరి రాముడు మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది.

ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయిన ప్రేమికులు

ప్రేమ వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఈ నెల 4న ప్రేమికులు ఇంటి నుంచి వెళ్లిపోయారు. ప్రకాశం జిల్లాలోని కొమరోలు మండలంలోని అక్కపల్లి గ్రామ శివారు ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకున్నారు. అక్కడి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సెల్ ఫోన్ ఆధారంగా ప్రేమికుల అడ్రస్సులు తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



కంబగిరి రాముడు (ఫైల్)



భారతి (ఫైల్)

మాధవరంలో విషాదఛాయలు

యువతి, యువకుడు ఆత్మహత్య చేసుకోవడంతో మాధవరంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇంటి నుంచి వెళ్లిపోయిన వారు వివాహం చేసుకొని వస్తారని అనుకున్నామని, అయితే ఇలాంటి నిర్ణయం తీసుకుంటారని అనుకోలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

'హంస'ను బలోపేతం చేద్దాం

- రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్



ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడితో నాయకులు

కర్నూలు హాస్పిటల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస)ను బలోపేతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ అన్నారు. ఈ మేరకు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యఆరోగ్య శాఖలో గుర్తింపు పొందిన మొదటి యూనియన్ తమదేనని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో 141 క్యాడర్ల కోసం నిరంతరం వారి పక్షాన నిలబడుతామన్నారు. అనంతరం జిల్లాకు వచ్చిన హంస రాష్ట్ర అధ్యక్షుడిని కర్నూలు సిటీ అధ్యక్షుడు టి.గోవిందు ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఏపీ హంస కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గైర్హాజరు కావడం విశేషం. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంటు, సంపత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు సత్యనారాయణ శర్మ, లీలమ్మ, పుష్పావతి, హెడ్ నర్సులు కే.ఉమ, సుగుణవతమ్మ, జే.నిర్మల, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసులు, కర్నూలు, నంద్యాల, ఆత్మకూరు, అనంతపురం జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఖాదీనం

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లా పరంగా చూస్తే కర్నూలులో ఇద్దరు, నంద్యాలలో మరో ఇద్దరు ఒప్పంద ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిపైన పర్యవేక్షణకు కర్నూలు జిల్లా ఇన్‌చార్జిగా కడప జిల్లా పరిశ్రమల కేంద్రంలో పనిచేసే క్రిష్ణయ్యను, నంద్యాల జిల్లాకు కర్నూలు చేనేత, జౌళిశాఖకు చెందిన అధికారి నాగరాజారావును బాధ్యుడిగా నియమించారు. ఈ ఇద్దరు ఉన్నతాధికారులు మాతృ సంస్థలోనే బిజీగా ఉండటంతో వారికి, ఇతర జిల్లాల స్థానా లకు బాధ్యులుగా ఇవ్వటం ప్రతికూలాంశంగా మారింది. అందుబాటులో ఉన్న జూనియర్ ఇన్‌స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఇద్దరు ఉద్యోగులు కార్యాలయ పనుల నిమిత్తం ఎక్కడికైనా వెళితే, ఆరోజుకు కార్యాలయం ఖాళీ అయినట్లే. ఇంత పెద్ద ప్రభుత్వ శాఖ అయిన నేటికీ ఈ విభాగానికి సొంత భవనం కానీ, కార్యాలయ గది కానీ అందుబాటులో లేవు. జిల్లా పరిశ్రమల కేంద్రంలోనే ఓ మూలాన కార్యాలయాన్ని నిర్వహిస్తుండటం గమనార్హం.

ఓవైపు పనిభారం..

కార్యాలయంలో పనిచేసే ఒప్పంద ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం. అసలే ఇద్దరే చిరు ఉద్యోగులు, ఓవైపు పనిభారం. మరో వైపు అరకొర వేతనాలు, చేతికి అందే రూ.16,500 తోనే అన్ని సరిపుచ్చుకోవాలి. కార్యాలయ అవసరాల కోసం చిన్న కాగితం కావాలన్నా సొంత జేబులోంచి ఖర్చు పెట్టాల్సిందే.

పీఎంఈజీపీ ఒక్కటే..

ఖాదీ బోర్డు ద్వారా పీఎంఈజీపీ(ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం) ఒక్కటే దీర్ఘకాలంగా అమలులో ఉంది. ఈ పథకం సైతం మూడు నెలలుగా అటకెక్కింది. నిధులలేమితోనే ఈ పథకం అమలును అర్ధాంతరంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. పథకం కోసం అవసరార్థులు పెద్ద సంఖ్యలో కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు, దరఖాస్తులు సమర్పిస్తున్నారు. వీరి దరఖాస్తులను సిబ్బంది స్వీకరించి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్నారే తప్ప, వాటిని ముందుకు పంపటం లేదు. దీంతో దరఖాస్తుదారులు అయోమయానికి, ఆందోళనకు గురి అవుతున్నారు. గతంలో మాదిరి లబ్ధిదారులకు రాయితీపై ఎటువంటి హామీ ప్రకటించలేదు. నిధుల లభ్యతను బట్టి మాత్రమే రాయితీని పరిశీలిస్తామని నిబంధనల్లో కొత్త మెలిక పెట్టటం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

అనుమతులు రాగానే ముందుకు పంపిస్తాం

అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. వాటిని ముందుకు తీసుకువెళ్లేందుకు ఇంకా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ముంబైలోని కేవీఐసీ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అవి రాగానే తదుపరి ప్రక్రియను కొనసాగిస్తాం. రాయితీపై స్పష్టత లేదు.

-క్రిష్ణయ్య, ఇన్‌చార్జి ఏడీ, కర్నూలు జిల్లా ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు

పాలకవర్గాలు లేని మార్కెట్ కమిటీలు

- పడకేసిన అభివృద్ధి
- లబోదిబోమంటున్న రైతులు



కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు దర అందిస్తున్న మార్కెట్ కమిటీల యార్డుల్లో అభివృద్ధి పడకేసింది. ప్రభుత్వం ద్వారా నిధులు తెప్పించి మార్కెట్ యార్డుల్లో వసతులను మెరుగుపరిచేందుకు మార్కెట్ కమిటీల అధికార యంత్రాంగం అంతగా శ్రద్ధ చూపడం లేదు. మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులు తాము చెసే విజ్ఞప్తుల కంటే పాలకవర్గాల ఒత్తిడికే ఎక్కువ స్పందన ఉంటుందని, నిధుల విడుదల తమ చేతుల్లో లేదని మార్కెట్ కమిటీల అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. గత సంవత్సరం 2024-25లో 15 మార్కెట్ కమిటీల ద్వారా దాదాపు రూ.50 కోట్ల ఆదాయం సెస్సు రూపంలో వచ్చింది. అయితే.. పాలకవర్గాలు లేకపోవడంతో ఈ నిధుల్లో మార్కెట్ కమిటీల అభివృద్ధికి ఖర్చు చేసే అవకాశం లేకుండా పోయింది. 15 మార్కెట్ కమిటీల్లో ఇప్పటి దాకా కేవలం నంద్యాల, పాణ్యం, నందికొట్కూరు, బనగానపల్లె, పత్తికొండ, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీలకు మాత్రమే పాలక వర్గాలు ఉన్నాయి. మిగిలిన 9 మార్కెట్ కమిటీలకు ఇప్పటి దాకా పాలకవర్గాలు ఏర్పాటు కాలేదు. దీంతో మార్కెట్ యార్డుల్లో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. ఇన్‌చార్జిల పాలన కారణంగా కర్నూలు, ఆదోని యార్డుల్లో కీలక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. అధికారులు, కమీషన్ ఏజెంట్ల లైసెన్సుల పునరుద్ధరణ, కొత్తవారికి లైసెన్సులు ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు పాలక వర్గాలు లేని కారణంగా నత్తనడకన సాగుతున్నాయి. కర్నూలు మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు అధికారులు గత కొద్ది నెలలుగా మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. జంబో ప్లాట్ ఫారం నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం వల్ల వర్షం వస్తే రైతులు నిల్వ చేసిన పంట ఉత్పత్తులు తడిసిపోతున్నాయి. మరుగుదొడ్లు, టాయిలెట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమీప కాలనీల్లోని డ్రైనేజీ నీళ్లన్ని మార్కెట్ యార్డులో నిల్వ ఉండి కుంటలను తలపిస్తున్నాయి. ఇక్కడ ఉన్న కమిషన్ ఏజెంట్లకు అంగళ్లు లేక రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను తమ షాపుల వద్ద నిల్వ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. అదే విధంగా కమిషన్ ఏజెంట్లు ఒక్క బిల్డింగులోనే ఇద్దరు, ముగ్గురు ఉండి వ్యాపారాలు చేసుకోవల్సిన పరిస్థితి దాపురించింది. పత్తికొండ, ఆలూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, పాణ్యం, డోన్, తదితర మార్కెట్ యార్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మార్కెట్ కమిటీల ద్వారా చేకూరిన సెస్సు ఆదాయం 40కోట్లకు పైగానే ట్రెజరీలో మూలుగుతోంది. ఈ నిధులు రాబట్టి రైతులకు అవసరమైన మౌలిక వసతులను యార్డుల్లో ఏర్పాటు చేయాలంటే పాలకవర్గాలతోనే సాధ్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

పాలకవర్గాలు త్వరలోనే ఏర్పాటవుతాయి



కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో 2 మార్కెట్ కమిటీలకు మాత్రమే పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా త్వరలోనే పాలకవర్గాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- నారాయణమూర్తి, ఏడీఎం

లారీ ఢీకొని వ్యక్తి మృతి

డోన్ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకున్నట్లు ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు. డోన్ మండలం కంబలపాడు రోడ్డు ప్రాంతంలో ఇమామ్‌బాషా(34) నివాసం ఉంటున్నాడు. స్వగ్రామమైన కొత్తబురుజులో జరుగుతున్న మొహర్రంలో పాల్గొనేందుకు వెళ్తున్నాడు. వెనుక వైపు నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

- గత నెల ఇంట్లో నుంచి వెళ్లిపోయిన విజేంద్ర

ఆలూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని గత నెల 29న ఇంట్లోంచి వెళ్లిపోయిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు, ఎస్ఐ తెలిపిన మేరకు.. పట్టణంలోని బాలు పాఠశాలలో హనుమంతప్ప కుమారుడు విజేంద్ర పదో తరగతి చదువుతున్నారు. చదువుకోకుండా క్రికెట్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించారు. దీంతో విజేంద్ర ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో తండ్రి హనుమంతప్ప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. అయితే ఆదివారం పొలాల్లో ఉరి వేసుకున్న విషయం తెలుసుకుని తల్లిదండ్రులు బోరున విలపించారు. ఎస్ఐ మహబూబ్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై బాలుడి అత్యాచారయత్నం

ప్రతిఘటించడంతో దాడి.. గాయపడ్డ మహిళ

ఆదోని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ మైనర్ బాలుడు వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింట్లో ఉంటుంది. కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. బంధువులు ఆదోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం బస్టాండ్‌లో ఆటో కోసం ఎదురుచూస్తుంది. అదే గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలుడు బైక్‌పై వచ్చాడు. నేను ఆదోనికి వెళ్తున్నానని, బైక్ ఎక్కాలని చెప్పాడు. గ్రామం దా టాక ఆబాలుడు ఆదోని వైపు కాకుండా కొండల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారయత్నం చేయగా ఆమె ప్రతిఘటించింది. కోపోద్రిక్తుడైన బాలుడు పక్కనే ఉన్న కట్టెతో ఆమెపై దాడి చేసి గాయపర్చాడు. వివాహిత తన బంధువులకు ఫోన్‌ద్వారా సమాచారమిచ్చి ఘటనా స్థలికి పిలిపించింది. మద్యం మత్తులో ఉన్న బాలుడిని గ్రామానికి తీసుకెళ్లి బంధించి పోలీసులకు సమాచారమిచ్చారు. బాలుడిపై అత్యాచార యత్నం, హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జీతాలు అందక కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన

కర్నూలు హాస్పిటల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి):కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జూన్ నెల జీతం అందక 600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు అల్లాడిపోతున్నారు. ప్రతి నెల 1, 2 తేదీల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు అందేవి. అయితే గత నాలుగైదు నెలలుగా కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్‌గా జీతాలు అందడం లేదు. ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల, పారామెడికల్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సిబ్బంది 600 మంది వివిధ క్యాడర్లలో పని చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన జీతాల బిల్లును ప్రతి నెల 25వ తేదీలోపు ట్రెజరీకి పంపించాల్సి ఉంటుంది. అయితే సంబంధిత ఉద్యోగి సరైన సమయంలో బిల్లులు పంపకపోవడం వల్లే జీతాలు ఆలస్యమవుతున్నాయనీ కాంట్రాక్టు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గతంలో పని చేసిన పరిపాలన అధికారులు ప్రతి నెల 25వ తేదీలోపు జీతాలు బిల్లులు ట్రెజరీకి పంపించేవారు. కానీ ఈ నెల 3వ తేదీ అయినా కాంట్రాక్టు ఉద్యోగుల హాజరు వివరాలు జీతాల వివరాలు పంపకపోవడంపై కాంట్రాక్టు ఉద్యోగులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రతి నెల 1 లేదా 2వ తేదీన జీతాలు రెగ్యులర్‌గా వచ్చేవని, కానీ ఇటీవల కాలంలో మరింత ఆలస్యం అవుతున్నాయనీ జీతం అందక కుటుంబ పోషణ భారాన్ని కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనున్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జీతాలు పంపిణీ చేసినా కర్నూలు జీజీహెచ్‌లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మాకు ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీకి ఫోన్‌లో వివరణ కోరగా.. ఏడీ అందుబాటులోకి రాలేదు.

జీవితంలో సైన్స్ ఒక భాగం కావాలి

- మూఢ నమ్మకాలతో భవిష్యత్తు అంధకారం
- జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్

కర్నూలు హాస్పిటల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో సైన్స్ ఒక భాగం కావాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌లో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) 16వ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సమావేశానికి సురేష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మూఢ నమ్మకాలతో భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. తెలంగాణ జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు మురళీధర్ మాట్లాడుతూ దేశంలో ప్రతి పౌరుడు భద్రతంగా ఉండాలంటే గాంధీ, అంబేద్కర్ మార్క్స్ భావజాలాలు సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు చేయాలన్నారు. జేవీవీ వ్యవస్థాపకులు డా.వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో సాగు, తాగునీటి సమస్య ఉందని, సామాజిక భద్రత ఉన్న ప్రతి పౌరుడు నీటి విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. రాయలసీమ నీటి విషయంలో అవగాహన లేకపోతే రాబోయే కాలంలో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని, రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి అన్నారు. సీమ ప్రజలు సాగు, తాగునీటిపై అవగాహన పెంచుకోవాలని, ఇప్పటికి పశ్చిమ ప్రాంత ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. డైట్ ప్రిన్సిపాల్ డా.ఆదినారాయణ రెడ్డి, నాయకులు సమత, డా.అరుణ, మహ్మద్ మియా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



WANTED TEACHERS
Wanted English, Maths, Science Social teachers to teach 1st to 7th classes and for NURSERY, LKG & UKG. 8328183717.
AJL-229036

MOIN BASHA
5- LINES
NAME CHANGE

MOIN BASHA
5- LINES
NAME CHANGE

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టు మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA-237899

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

సమస్యలు పరిష్కరించాలి

మిడుతూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నంపల్లె గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం నాయకులు గ్రా మంలో పర్యటించారు. సీసీరోడ్లు, డ్రైనేజీ, విద్యుత్‌లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాయకులు ఓట్లకోసం వవస్తారని సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. రామకృష్ణ, ఓబులేసు, స్వాము లు, ఉస్మాన్ బాష, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోక కల్యాణానికే పాదయాత్ర

పాములపాడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణానికే పాదయాత్ర చేస్తున్నట్లు నాగసాయి బ్రహ్మవిద్య ఆశ్రమం పీఠాధిపతి రామనందస్వామి తెలిపారు. ఆదివారం జూటూరు గ్రామ శివార్లలోని ఆశ్రమం నుంచి రెండువందల మందితో తొలి ఏకాదశి సందర్భంగా జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామం పాండురంగస్వామి దేవాలయానికి పాదయాత్రగా బయలు దేరారు. భక్తులు పూలు చల్లి హారతులతో స్వాగతం పలికారు.

ఏకలవ్యుడికి ఘన నివాళి

ఆత్మకూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏకలవ్యానగర్‌లో ఆదివారం ఏకలవ్యుడి జయంతి నిర్వహించారు. ఏకలవ్యుడు, అంబేద్కర్ చిత్రపటాలకు డాక్టర్ నిరంజన్ నివాళి అర్పించారు. ఏకలవ్యుడి భావన, త్యాగనిష్ఠలు అసామాన్యమైనవని అన్నారు. యువత ఏకలవ్యుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పాపారాయుడు, ధనుంజయుడు, కుప్పస్వామి, శ్రీనివాసులు, చిన్న నరసింహులు, సుంకన్న న్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

నంద్యాల రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. ఆదివారం టెక్కె మార్కెట్‌యార్డు నుంచి గాంధీచౌక్ వరకు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను పాటిస్తూ, కార్మికుల హక్కులను కాలరాయడం తగదన్నారు. 44 కార్మిక సంఘాలను కుదింపు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లుగా కుదింపు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతులలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షకార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి తీరని లోటు

బండిఆత్మకూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ లింగాపురం గ్రామానికి చెందిన షఫీవుల్లా అకాల మరణం టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి అన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళి అర్పించారు. పలువు నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు జవాబుదారీతనం లేదు

రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు
వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నంద్యాల రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు జవాబుదారీతనం లేకుండా పరిపాలన కొనసాగించారని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాలు ఏర్పాటుచేసి సరైన మార్గదర్శనం చేయలేక పాలనను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రాజ్యాంగం రూపొందించిన మార్గదర్శక సూత్రాలను ఆచరించడంలో విఫలం చెందారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను దారి మళ్లించి ఇష్టారీతిన ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈనెల 8న పంచాయతీ కార్యదర్శుల సమస్యలు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. అనంతరం ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ పంచాయతీ నిధుల పంచాయతీకే కేటాయించాలని, 6గా ఉన్న పంచాయతీ గ్రేడులను 3గా కుదించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలన్నారు. సమస్యలతో కూడిన వినతిని మంత్రికి సమర్పించారు.

జిల్లా కమిటీ ఎన్నిక : అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యశ్వంత్‌కుమార్, జనరల్ సెక్రెటరీగా వెంకటేశ్వర్లు, ట్రెజరర్ అంకన్న, అసోసియేట్ అధ్యక్షుడిగా జమాలయ్య, వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా అబ్దుల్‌సలాం, సుంకన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రెజరర్ శేషన్న, ఉపాధ్యక్షులు వేణు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎంపీ

జూపాడుబంగ్లా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. మండలంలోని పోతులపాడు, 80బన్నూరు గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించకారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చారన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాగేశ్వరరావు, కాకరవాడ చిన్నవెంకటస్వామి, శివానందరెడ్డి, సైఫుద్దీన్ పాల్గొన్నారు.



పోతులపాడులో పథకాల గురించి వివరిస్తున్న బైరెడ్డి శబరి

వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

మహానంది: గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అయ్యిందని, అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఎమ్మెల్యే బుడ్డా మహానంది మండలం తమ్మడపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ బన్నూరి రామలింగారెడ్డి, ఎంపీపీ యశస్వీని, టీడీపీ నాయకుడు శ్యామల జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



తమ్మడ పల్లిలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి..

సంక్రమిత వ్యాధులతో ప్రమాదం

పాణ్యం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులతో ప్రమాదముందని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ కమలాకర్ పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్య కేంద్రం వద్ద జంతువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు దాదాపు 150వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. సకాలంలో జంతువులకు టీకాలు వేయించాలన్నారు. సిబ్బంది సౌమ్య, పూజిత, గోపాలమిత్ర ఉపేంద్ర పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

నంద్యాల హాస్పిటల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని నంది బాడ్మింటన్ అకాడమిలో రెండురోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లా బాడ్మింటన్ క్రీడాకారుల జట్ల ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా నందిగ్రూప్స్ అధినేత్రి సుజల హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ బాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వంశీధర్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి దాదాపు 300మంది క్రీడాకారులు జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొన్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్లను నందిగ్రూప్స్ అధినేత్రి సుజల అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ సభ్యులు శేషిరెడ్డి, సంజీవరెడ్డి, డాక్టర్ జనార్దన్ రెడ్డి, బాడ్మింటన్ కోచ్ నాగార్జున, చైతన్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్పెంటర్ షాపులో అగ్నిప్రమాదం



కాలిపోయిన కార్పెంటర్ షాపు

వెలుగోడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీ నగర్‌లోని కార్పెంటర్ షాపులో అగ్ని ప్రమాదం సంభవించింది. బాధితుల కథనం మేరకు.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి, సామగ్రి కాలి బూడిదైంది. దాదాపు రూ.16 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు జయరాజు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు ఎస్ఐ సురేశ్ ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

నంద్యాల రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ జిల్లా నాయకులు కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రైతుసంఘ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతుల పొగాకు కొనుగోలు చేయాలన్నారు. పొగాకు రైతులు వడ్డీలు చెల్లించ లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్యాబినేట్ సమావేశంలో చర్చించి రైతులను ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. మంత్రిని కలసిన వారిలో జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సుబ్బరాయుడు, సీపీఎం నాయకుడు పుల్లా నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ తాలుకా కార్యదర్శిగా ప్రతాప్

ఆత్మకూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ తాలుకా కార్యదర్శిగా ప్రతాప్, సహాయ కార్యదర్శిగా అహ్మద్‌హుసేన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఆత్మకూరు ఎంఎం గార్డెన్‌లో నిర్వహించిన మహాసభల్లో తమను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

పాణ్యం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో 280 మందికి గాను 8 మంది గైర్హాజరైనట్లు పరీక్షల పర్యవేక్షకులు డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో 180 మందికి గాను తొమ్మిది మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహకులు అహ్మద్ బాషా తెలిపారు. విద్యార్థులకు కళాశాల యాజమాన్యం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

నంద్యాల కల్చరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో ముస్లింలు మొహర్రం కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో మొహర్రం సందర్భంగా ఆదివారం పీర్ల చావిడివద్ద భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి నీలివీధిలోని బిఫాతీమా, భైరమల్ వీధిలోని అలీ అక్బర్, పెద్దబండ దగ్గరలోని బుడ్డాబుడ్డి, నడిగడ్డలోని హుస్సేన్ హుస్సేన్, తెలుగుపేట ఇమాం ఖాసీం పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు పీర్లను సామూహికంగా కుందూనది ఒడ్డుకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

పాణ్యం: మండలంలో మొహర్రంలో భాగంగా ఏర్పాటు చేసిన పీర్లను నిమజ్జనానికి తరలించారు. గోరుకల్లులోని పెద్దస్వామి, డాల్ స్వామి, దర్గా వద్ద పెద్ద ప్రజలు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పాణ్యంలో అల్లవారు స్వామి దర్గా వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీర్లను గ్రామంలో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. పీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గడివేముల: మండలంలోని ఆదివారం పీర్లను ఊరేగించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు వచ్చి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. పీర్లకు పూలు, దట్టీలు సమర్పించారు. ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం మొహర్రం వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 1వ తేదీనపెద్ద పీర్లవీధి, పెద్ద బజార్, గొల్లపేట, వడ్లరామాపురం రస్తా, నీటితొట్ల వీధి, అర్బన్‌కాలనీల్లో పీర్లను ప్రతిష్టించారు. భక్తులు తరలివచ్చి పీర్లకు మొక్కులు తీర్చుకున్నారు. చివరిరోజైన ఆదివారం రాత్రి పీర్లచావిడి వద్ద అగ్నిగుండం చుట్టూ పీర్లను ఊగించి వేడుకలకు ముగింపు పలికారు. డ్రమ్స్‌వాయిద్యాల నడుమ యువత సంబరాలు చేసుకున్నారు.



నంద్యాలలో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



గడివేములలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన పీర్లు

పట్టణ మహా సభలను విజయవంతం చేయండి

నంద్యాల రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ 17వ మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 8న స్థానిక వివేకానంద ఆడిటోరియంలో సభలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

వెలుగోడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ సురేశ్ సూచించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఆదివారం స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, తప్పక హాజరు కావాలని సూచించారు.

ఈ ఏడాది ముందుగానే సాగునీరు

ఎమ్మెల్యేలు గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖరరెడ్డి

పాములపాడు జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 20 రోజులు ముందుగానే సాగునీరు విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యేలు గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని బనకచెర్ల క్రాస్‌హెడ్ రెగ్యులేటర్ నుంచి ఐదువేల క్యూసెక్కుల నీటిని వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు, అలాగే కేసీ కెనాల్‌కు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు దివంగ ఎన్టీఆర్ పోతిరెడ్డిపాడు వద్ద ప్రాజెక్టు నిర్మించి, బనకచెర్ల రెగ్యులేటర్ నుంచి సీమకు సాగునీందించారన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్లలో ప్రాజెక్టు గేట్లకు గ్రీజు కూడా పూయలేదని, మరమ్మతులు చేయకపోవడంతో గేట్లు తెగి తీవ్ర నష్టం వాటిల్లిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రాజెక్టుల నిర్వహణకు వందలకోట్లు ఖర్చు చేసిందని, రైతు క్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం డ్యాంకు భారీగా వరద చేరిందని, త్వరలోనే సీఎం దిగువకు నీటిని విడుదల చేస్తారన్నారు. హరినాధరెడ్డి, గోవిందు, లక్ష్మికాంతరెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, మధు, వెంకటేశ్వర రెడ్డి, లింగేశ్‌గౌడ్, మోహన్‌గౌడ్, సురేశ్, కరీంబాషా డీఈఈ నాగేశ్, జేఈ నాగేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న
ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్య

బాలిక హత్యకు నేటితో ఏడాది

- నిందితులను శిక్షించాలంటున్న తల్లిదండ్రులు

పగిడ్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక వాసంతి హత్యకు గురై నేటితో ఏడాది కానుంది. అప్పట్లో ఈ ఘటన రాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎంపీ శబరి, ఎమ్మెల్యే జయసూర్య సం ఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేసి, బాధిత కుటుంబానికి న్యా యం చేయలని పోలీసులను ఆదేశించారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలే నదీలో అత్యాధునిక పరికారాలతో నదిలో గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. నదిలోకి వరద రావడంతో గాలింపు సాధ్యం కాలేదు. నిందితులపై వివిధ చట్టాల కింద కేసులు నమోదు చేసి రిమాండ్ పంపారు. కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ బాధితులను పరామర్శించారు. మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, అధికారులు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10లక్షల చెక్కును అందజేశారు. పక్కా గృహం మంజూరు చేయాలని ఆదేశించినా ఇంతవరకు ఇల్లు మంజూరు కాలేదని తెలిపారు.



ముచ్చుమర్రిలో వాసంతి ఫొటోతో కుటుంబ సభ్యులు

నిందితులకు శిక్ష పడితేనే శాంతి

నా కూతురిని హత్యచేసిన నిందితులకు కఠిన శిక్ష పడితేనే నా కూతురి ఆత్మకు శాతి చేకురుతుంది. శిక్ష పడేలా చూస్తామన్న అధికారులు, నాయకుల హామీ ఏడాది కావస్తున్నా నురవేరలేదు.

● మద్దిలేటి, బాలిక తండ్రి

మర్చిపోలేకున్నాం

నా కూతురు చనిపోయి ఏడాదైనా మర్చిపోలేకున్నాం. అక్క వాసంతిని తమ్ముడు పదే పదే గుర్తు చేసుకొని ఏడుస్తున్నాడు.

● సుజాత, బాలిక తల్లి

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

నంద్యాల కల్చరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఆదివారం ఏకాదశి సందర్భంగా పలు ఆలయాలలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంజీవనగర్ కోదండరామాలయంలో లక్ష్మీవెంకటేశ్వరునికి, పద్మావతినగర్‌లో శ్రీకృష్ణమందిరంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. సంజీవనగర్ రామాలయంలో వేంకటేశ్వరుడు మత్స్యావతార అలంకారంలో భక్తులు దర్శనమిచ్చారు. సంజీవనగర్ రామాలయం, రమాసమేత సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉమామహేశ్వర ఆశ్రమం, శ్రీకృష్ణమందిరంలో భక్తులు భగవద్గీతలోని 18 అధ్యాయాలను గీతాపారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

● నంద్యాల పప్పులబట్టీ బజారులో వెలసిన రుక్మిణి పాండురంగ స్వామి దేవాలయంలో ఏకాదశి సందర్భంగా భావసారక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో స్వామివార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకి సేవ నిర్వహించారు.

● నంద్యాల బొమ్మలసత్రం సాయిబాబా ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం బాబా వారి గ్రామోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● పట్టణంలోని జగజ్జననీ అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ఆదివారం ఏకాదశి సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పుట్టింటి పట్టుచీర సారె కార్యక్రమంలో భాగంగా జగజ్జననీ అమ్మవారికి విజయనగరం, గద్వాల,కాండ్లపల్లె, సిమెంట్ నగర్, వెంకటాపురం, మహబూబ్‌నగర్, మార్కాపురం, పెద్దకొట్టాల, మాచర్ల, అనంతపురం, గుంటూరు, ఏ కోడూరు తదితర ప్రాంతాల నుంచి మహిళాభక్తులు అమ్మవారికి సారె సమర్పించారు.

బండిఆత్మకూరు: మండలంలోని ఏ కోడూరు గ్రామానికి చెందిన మహిళలు నంద్యాలలోని జగజ్జననీ మాతకు సారె తీసుకెళ్లారు. ఆదివారం గ్రామంలోని మహిళలంతా సామూహికంగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఏకాదశి ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, అర్చనలు చేశారు. బిలకలగూడురు గ్రామ సమీపంలోని బాలాజీ ఆలయంలో భక్తులు భారీగా తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నందికొట్కూరు రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలు కిక్కిరిశాయి. ఎంపీ బైరెడ్డి శబరి బొల్లవరం లక్ష్మీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సూర్యుడు ఉత్తరార్ధగోళం నుంచి దక్షిణార్థ గోళం వైపుగా ప్రయాణిస్తాడని భక్తుల నమ్మిక. నాలుగు నెలల పాటు శ్రీమన్నారాయణుడు శేష తల్పంపై శయనిస్తాడని, ముక్కోటి ఏకాదశి నాడు నిద్ర లేస్తాడని అప్పుడు ఉత్తర ద్వారంలో భక్తులు స్వామిని దర్శించుకుంటారు.

మహానంది: మహానంది క్షేత్రంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయ వేదపండితులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాలతో పాటు మెదటి ప్రాకారంలోని ధ్వజస్తంభం పరిసరాల్లో ఏఈఓ ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో లఘు సంప్రోక్షణ చేశారు. స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలకు తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలతో గణపతి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన గంగి వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులు 23 తులాల వెండి కాసుల హారాన్ని సమర్పించినట్లు ఏఈవో ఎర్రమల్ల మధు తెలిపారు. ఆదివారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో దాతలు దాదాపు రూ.25 వేల విలువగల వెండికాసుల హారంతో పాటు రూ.3,500 విలువ గల పట్టుచీరను అందజేశారు. అర్చకులు రాజమాణిక్యశర్మ, మూలస్థానం సుబ్బయ్యశర్మ పాల్గొన్నారు.

● మహానందిలో దేవస్థానం నిర్వహిస్తున్న గోశాల సంరక్షణ నిధికి వినుకొండ తాలుకా వడ్డెంగుంటకు చెందిన మిలియ పల్లి స్థానిక రూ.10116 విరాళం ఇచ్చినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు.



జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి సారె తీసుకెళ్తున్న భక్తులు



బొమ్మలసత్రం సాయిబాబా
కమిటీ ఆధ్వర్యంలో బాబా వారి గ్రామోత్సవం



మహానందిలో స్వామి,అమ్మవార్లకు పూజలు



ఎ.కోడూరులో సారె తీసుకెళ్తున్న మహిళలు



మహానంది: క్యూలైన్‌లో భక్తులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

దోబుచులాడుతున్న మేఘాలు

● వర్షం కోసం రైతన్న ఎదురు చూపు



చాగలమర్రిలో నల్లటి మబ్బులతో ఆకాశం

చాగలమర్రి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడిచినా వరుణుడు కరుణించకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. మండలంలో ఇప్పటికే మొక్కజొన్న, ఉల్లి, కంది తదితర పంటలు సాగు చేయగా మరి కొందరు రైతులు విత్తనాలు వేసుకునేందుకు పొలాలను సిద్ధం చేశారు. అయితే వరుణుడు కరుణించకపోవడంతో పంటల సాగు కోసం ఎదురు చూస్తున్నారు. చాగలమర్రి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఆకాశంలో నల్లటి మేఘాలతో ఆకాశం మబ్బులు కమ్ముకున్నాయి. వర్షం కురవక మేఘాలు దోబుచులాడుతున్నాయి. సూర్యుడు అస్తమించే సమయంలో ఏర్పడే ఎర్రటి కిరణాల మధ్య నల్లటి మేఘాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

రైతులు సుభిక్షంగా ఉండాలని..



కలశాలతో యాగంటి క్షేత్రానికి వెళ్తున్న మహిళలు

బనగానపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా లోక కల్యాణార్థం, రైతులు సుభిక్షంగా ఉండాలని పాడిపంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ బనగానపల్లె నుంచి యాగంటి క్షేత్రానికి ఆదివారం మహిళలు తీర్థ కలశయాత్రను నిర్వహించారు. పట్టణ శివారులోని రవ్వలకొండలోని హట్టిముని స్వామి ఆలయం నుంచి విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు, గీత భజన భక్త మండలి ఆధ్వర్యంలో తీర్థ కలశాలను తలపై పెట్టుకొని మహిళలు సుమారు 12 కిలోమీటర్ల నడచుకుంటూ యాగంటి క్షేత్రానికి చేరుకున్నారు. ఉమామహేశ్వర స్వామికి తీర్థ కలశాలతో మహిళలు అభిషేకం చేశారు. సుమారు 15 గ్రామాల నుంచి మహిళలు కలశయాత్రలో పాల్గొన్నారు. భక్తులకు ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ వారు భోజన వసతి కల్పించారు.

మానవత్వం చాటుకున్న మంత్రి బీసీ

● గాయపడ్డ వ్యక్తిని కాన్వాయ్‌లో వైద్యశాలకు తరలింపు



క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న మంత్రి

బనగానపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. బనగానపల్లె నుంచి ఉదయం పోతిరెడ్డి పాడు గేట్లు ఎత్తేందుకు వెళ్తుండగా పాణ్యం - కర్నూలు రహదారిపై ఓర్వకల్లు సమీపంలో ప్రమాదానికి గురై గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తిని మంత్రి గుర్తించారు. వెంటనే బాధితుడిని తన కాన్వాయ్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కర్నూలు ప్రభుత్వ వైద్యులకు మంత్రి ఫోన్ క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ఏడాదిలోనే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నాయుడు ఏడాదిలోనే ఐదేళ్ల సంక్షేమ పథకాలు అందజేశారని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ కో.కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి కూటమి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి ఐదేళ్లలో అందించిన మొత్తాన్ని ఒకే ఏడాదిలో ఇంటికి ఇద్దరూ, ముగ్గురూ, నలుగురికి అందించి చంద్రబాబు చరిత్ర సృష్టించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటమల్లారెడ్డి, పెద్దిరెడ్డి, ఓబులేషు, చిన్న రామిరెడ్డి, సర్పంచ్ శివశంకర్, ఉపసర్పంచ్ రామలక్ష్మణ్ణ, పెద్ద వెంకటేషులు, శంకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి: డీఎస్పీ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ, జూలై 6(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డీఎస్పీ ప్రమోద్ కోరారు. ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం మొదటి వార్షికోత్సవం సందర్భంగా నంద్యాల బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్లడ్ డోనార్స్ టీం సభ్యులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు మహ్మద్ హుసెన్, ప్రజ్ఞా డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు చంటి పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

బేతంచెర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దళితులకు బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని దళిత సంఘం నాయకులు మేకల నాగరాజు, రూబెన్ అన్నారు. జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని ఆయన విగ్రహానికి దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిజన నాయకుడు రవీంద్ర నాయక్, వార్డు కౌన్సిలర్లు రామాంజనేయులు, రామగోపాల్, నంద్యాల మధు, రామసుబ్బయ్య, శ్రీపతి, నాగరాజు, గూటం శివ, రామవరం శివ పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి

● ఆలయాలను దర్శించుకున్న భక్తులు



శివపార్వతులకు పూజలు చేస్తున్న మహిళలు



ప్యాపిలిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

బనగానపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లెలో తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. బన గానపల్లె, వివిధ గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో, యాగంటి క్షేత్రంలో ఉమా మహేశ్వరస్వామి వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

చాగలమర్రి: స్థానిక కోదండరామాలయం, చెన్నకేశవస్వామి, పాత శివాలయం, మూడు రాళ్లపల్లెలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతులకు విష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. పార్వతీదేవికి సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని మహిళలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలో తొలి ఏకాదశి పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మానసలింగేశ్వరస్వామి దేవాలయంలో అభిషేకాలు చేశారు. అలాగే నరసింహస్వామి, వెంకటేశ్వరస్వామి, సంతాన వేణుగోపాల స్వామి దేవాలయాల్లో పూజలు చేశారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇంజేడు గ్రామంలో అర్చకుడు అనంతశర్మ వెంకటేశ్వరస్వామికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్.జంబులదిన్నె గ్రామం మెట్ట వద్ద వెలసిన అభయాంజనేయస్వామికి అర్చకుడు కీర్తి లక్ష్మణస్వామి అభిషేకం, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి హారతి నిచ్చి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.



ఇంజేడు గ్రామంలో వేంకటేశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకులు



ఆర్.జంబులదిన్నె గ్రామంలో ..

ప్రహ్లాద వరద స్వామికి అభిషేకం



పంచామృతాభిషేకం చేస్తున్న ఆలయ అర్చకులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో ఆదివారం భూమి నీలా సమేత ప్రహ్లాద వరద స్వామికి నవకలశ పంచామృతాభిషేకం నిర్వహించారు. తొలి ఏకదశి స్వామిఅమ్మవార్లకు ఆలయ ప్రధాన పూజారి కిడాంబి వేణుగోపాలన్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు రాత్నంగి కవచంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

● నిమజ్జనానికి పీర్లు తరలింపు

● మొక్కులు తీర్చుకున్న భక్తులు



చాగలమర్రిలో జనసందోహం మధ్య లాల్‌స్వామి పీరు ఊరేగింపు



బేతంచెర్లలో కోట్ల పీర్లు..

చాగలమర్రి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో ఆదివారం హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా మొహర్రాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నమకానం వీధిలో కొలువుదీరిన లాల్‌స్వామి పీరును భారీ జనసందోహం మధ్య ఊరేగించారు. గ్రామ చావిడి నుంచి గంధం చల్లుకుంటూ పిల్లలు, పెద్దలు, యువకులు మేళతాళాలతో లాల్‌స్వామి పీరును గ్రామోత్సవం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు ఫతెహాలు సమర్పించారు. అలాగే ఆయా వీధుల్లో కొలువుదీరిన హుస్‌సయ్యద్, హుసన్, హుసేన్, అలిఅక్బర్ పీర్ల చావిడిల వద్దకు వెళ్లి ఫతెహాలు చేసి లాల్‌స్వామిని ఊరేగింపు చేశారు. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలీసులు డ్రోన్‌లతో నిఘా ఉంచారు.

బనగానపల్లె: మండలంలోని యనకండ్ల, హుస్సేనాపురం, యర్రగుడి, పలుకూరు, రామకృష్ణాపురం, నందవరం, నందివర్గం, వెంకటాపురం, కైప, అప్పలాపురం, టంగుటూరు, ఇల్లూరుకొత్తపేట గ్రామాల్లో మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిందూ, ముస్లింలు కలిసికట్టుగా పాల్గొన్నారు. సాయంత్రం ఉత్సవాల సందర్భంగా పీర్లను ఏటి వద్ద వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తును నిర్వహించారు.

రుద్రవరం: మండలంలోని కోటకొండ, యల్లావత్తుల, శ్రీరంగాపురం, బి.నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో మొహర్రం ఆదివారం ముగిశాయి. గ్రామాల్లో మేళతాళాలతో పీర్లను ఏటికి సాగనంపారు. ఘనంగా పెద్దసరిగెత్తు మండలంలో ఆదివారం ఘనంగా పెద్ద సరిగెత్తు నిర్వహించారు. కొండమాయపల్లె, రుద్రవరం, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, వెలగలపల్లె, నాగలవరం, నరసాపురం, ముత్తలూరు గ్రామాల్లో భక్తులు పీర్లకు ఫతెహాలు చేశారు. అగ్నిగుండాల ప్రవేశం చేసి భక్తిని చాటుకున్నారు. ఎస్ఐ మహ్మద్‌రఫి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కోవెలకుంట్ల : వివిధ ప్రాంతాల్లోని పీర్ల చావిడిలో కొలువైన పీర్లు ప్రత్యేక పూజలు అందుకున్న అనంతరం నిమజ్జనానికి తరలించారు. సౌదరదిన్నె నుంచి బాదుల్లా పీరు పట్టణానికి చేరుకోవడంతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బేతంచెర్ల: పట్టణంలో కొలువుదీరిన పీర్లు ఐదు రోజుల పాటు పూజలందుకుని నిమజ్జనానికి ఆదివారం ఊరేగింపుగా బయలు దేరాయి. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పీర్ల నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్ బాబు, ఆయా గ్రామాల్లో పట్టణ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

దొర్నిపాడు: దొర్నిపాడు గ్రామంలో పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లకు ప్రజలు ప్రత్యేక ఫతెహాలు చేశారు. మధ్య సరిగెత్తు కావడంతో భక్తులు పానకం, చక్కెర తీసుకొచ్చి ఫతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

డోన్ రూరల్: మండలంలోని వెంకటనాయునిపల్లె, చిన్నమల్కాపురం, చనుగొండ్ల, వెంకటాపురం తదితర గ్రామాల్లో మొహర్రంలో భాగంగా పెద్ద సరిగెత్తు వైభవంగా జరిగాయి. సర్పంచ్ శీలం చంద్రశేఖర్ నాయుడు, కుటుంబ సభ్యులు పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ప్యాపిలి: మండలంలో పీర్ల సవారీ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లు ఎత్తుకొని అగ్ని గుండంలోకి దిగాయి. అలాగే జలదుర్గం, బూరుగుల, రాచెర్ల, నేరేడుచెర్ల, అలేబాదు గ్రామాల్లో మొహర్రం నిర్వహించారు.

కొలిమిగుండ్ల : మండలంలోని మీర్జాపురం గ్రామంలో ఆదివారం మొహర్రం ముగిసింది. పెద్ద సరిగెత్తు వేడుకల్లో భాగంగా టీడీపీ నాయకులు పోరెడ్డి చిన్నపురెడ్డి, వేణు, శ్రీరాముడు, పాండు, రామ్మూర్తి తదితరులు పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పీర్లను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

అవుకు : పట్టణంలో పెద్ద సరిగెత్తును ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆదివారం జరుపుకున్నారు. పీర్లకు పూజలు చేసి ఫతెహాలు సమర్పించారు. సదివింపుల కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం నిమజ్జనం చేస్తారు.



కోవెలకుంట్లలో..



అవుకులో..

ఘనంగా ఏకలవ్యుడి జయంతి



ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌టీఎఫ్ నాయకులు

డోన్ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్థానిక నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎస్‌టీఎఫ్) కార్యాలయంలో ఏకలవ్య జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు రాగుల రాముడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో దొరపల్లి సర్పంచ్ మేడసరి రాముడు, ఎరుకుల నాగరాజు, నరసింహులు, నూరప్ప పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని సాయిబాబా కాలనీ ఏకలవ్యుడు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘం నాయకుడు గంగన్న ఆధ్వర్యంలో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ కార్యదర్శి బైరి బాలరాజు, రమేష్, బైరి గుర్రప్ప చౌట వెంకటరమణ, నరసింహులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కోవెలకుంట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జోళదరాశి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చంద్ర ఓబులేసు అనే వ్యక్తి గత నెల 30న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య ప్రసన్న భర్త ఆచూకీ కోసం బంధువుల ఇళ్ల వద్ద విచారించింది. ఆదివారం కోవెలకుంట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొలిమిగుండ్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోర్విమానుపల్లె గ్రామానికి చెందిన అంజి (25)కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గోర్విమానుపల్లె గ్రామానికి చెందిన అంజి మూడు రోజుల క్రితం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతికివచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి

టైర్‌పేలి దుకాణంలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

కొలిమిగుండ్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ టైరు పేలడంతో అదుపు తప్పి దుకాణం (బంకు)లోకి దూసుకెళ్లింది. దీంతో దుకాణంలో కూర్చున్న వ్యక్తి లేచి పరుగుతీయడంతో ప్రమాదం తప్పింది. తాడిపత్రి నుంచి క్రిష్ణుడు ట్రాక్టర్ కొలిమిగుండ్లకు ఇటుకలు తీసుకెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

చట్టసభల్లో 44 శాతం రిజర్వేషన్ కల్పించాలి

● రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు పోతుల నాగరాజు



డోన్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న సమితి నాయకులు

డోన్ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ సమీపంలోని ఓ హోటల్ ప్రాంగణంలో బహుజన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మానానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో, పార్లమెంటులో ఏకాభిప్రాయం తీసుకువచ్చేందుకు బహుజన ప్రజాప్రతినిధులను, పార్టీల అధ్యక్షులను అభ్యర్థిస్తూ వచ్చేనెల 3న అనంతపురం లలితా కళాపరిషత్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్‌పీఎస్ రాయలసీమ జిల్లాల కన్వీనర్లుగా శంకర్‌గౌడును ఆర్‌పీఎస్ స్టేట్ యూనిట్ కన్వీనర్‌గా శివకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, ఉమాశంకర్, శ్రీనివాసులు, నాగభూషణం, దేవేంద్రగౌడు, మోహన్‌గౌడు, యాగంటి, సుబ్బుయాదవ్, తెలుగు విజయకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మకు పూజలు



చింతలచెరువులో గంగమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలచెరువు గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం గంగమ్మ దేవత జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పండితుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో గంగమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు సామూహికంగా గంగమ్మకు సారె సమర్పించి సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించాలంటూ జలాభిషేకం చేశారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం ప్రపంచ జోనోసిస్ డే సందర్భంగా పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు పశువైద్య సిబ్బంది టీకాలు వేశారు. జోనోసిస్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కుక్కల నుంచి ర్యాబిట్స్ వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది షజి, మహబూబ్‌బాష, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక పశువైద్యశాలలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే నిర్వహించారు. పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ కుక్కలకు జూనోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

దొర్నిపాడు: మూగజీవాల నుంచి మనుషులకు సంక్రమించే ర్యాబిట్స్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి చిన్నబాబు సూచించారు. ఆదివారం దొర్నిపాడు పశువైద్యశాలలో జూనోసిస్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో అన్వర్‌బాష, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగులు పేర్లు నమోదు చేయించుకోవాలి

కోవెలకుంట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విభిన్నప్రతిభావంతులు ప్రభుత్వం నుంచి ఉచితంగా ఉపకరణాలు పొందేందుకు పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8న బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల సంజామల, బనగానపల్లె మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులకు వయోవృద్ధులకు ఉచితంగా పరికరాలు ప్రభుత్వం ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకుంటుందన్నారు. అర్హులైన వారు సర్టిఫికెట్లతో హాజరై పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

కోవెలకుంట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు విగ్రహాన్ని కోవెలకుంట్లలో ఏర్పాటు చేయాలని బాలక్రిష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు, మాజీ కోఆప్షన్ మెంబరు షేక్ ఖాసిం కోరారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బాలక్రిష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులతో మండల సమావేశం నిర్వహించారు. ఖాసిం మాట్లాడుతూ త్వరలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలవనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వేణుగోపాల్‌నాయుడు, గురప్ప, పాపిరెడ్డి, సుబ్బయ్య, సత్యం, పెద్ద కులాయి, వాసు, బాషా, టైలరు రమేశ్, షరీఫ్, శివ, మల్లేశ్, ఫక్కీరయ్య నారాయణ, సుబ్బరాయుడు, రంగడు పాల్గొన్నారు.

కృష్ణజింక మృతదేహం ఖననం

రుద్రవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం రేంజ్‌పరిధిలోని ఆళ్లగడ్డ మండలం బత్తలూరు గ్రామ సమీపంలో శనివారం రాత్రి కృష్ణజింక మృతి చెందిన విషయం విదితమే. పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఇన్‌చార్జి రేంజర్ ముర్తుజావలి ఆదేశాల మేరకు కళేబరాన్ని ఫారెస్టు కార్యాలయ ఆవరణంలో ఖననం చేశారు. వన్యప్రాణులు గ్రామాల సమీపంలోకి వస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డాగ్‌స్క్వాడ్ సెక్షన్ ఆఫీసరు మహబూబ్‌ఖాన్, బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి

రుద్రవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డి.కొట్టాల పంచాయతీ మజరా తుమ్మలకొట్టాల గ్రామంలో మంచినీటి పథకానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన వ ట్లాడారు. విద్యుత్ లైనుకు కొత్త వైరు ఏర్పాటు చేస్తుండగా యల్లావత్తుల గ్రామస్తులు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 120 కుటుంబాలు ఉన్నాయని, విద్యుత్ సరఫరాలేక పోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుల్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. విద్యుత్ ఇన్‌చార్జ ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ సమస్యను పరిశీలించి విద్యుత్ లైను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

టెంకాయ ధర రూ.45

రుద్రవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కేరళలో వరదలకు అక్కడ రైతాంగం నష్టపోయింది. టెంకాయల ధరలు ఒక్కసారిగా రూ.20 నుంచి రూ.40, రూ.45 వరకు పెరిగింది. ఒక్కో టెంకాయపై రేటు రూ.25 అదనంగా పెరగడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. కేరళ నుంచి సరఫరా లేకపోవడంతోనే రేట్లు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

పీవీఎన్ మాధవ్‌కు శుభాకాంక్షలు

డోన్ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌ను డోన్ నాయకులు ఆదివారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

చంద్రబాబుతోనే పేదరిక నిర్మూలన

ప్యాపిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని టీడీపీ నంద్యాల పార్లమెంటు కార్యదర్శి అలేబాదు పరమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని అలేబాదు గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు హరికుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.